

హిమాయత్‌సాగర్ లార్డ్స్ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద పోలీసు బందోబస్తు

# నేడే ప్రజా తీర్పు

- రంగారెడ్డి జిల్లా ఎన్నికల బరిలో 209 మంది అభ్యర్థులు.. ఫలితాలపై ఉత్కంఠ
- ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు చేసిన జిల్లా ఎన్నికల అధికారులు
- 8 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు మూడు చోట్ల పటిష్ఠ ఏర్పాట్లు
- ఒక్కో నియోజకవర్గానికి 14 చొప్పన టేబుళ్లు
- పోస్టల్ బ్యాలెట్ల కోసం ప్రత్యేక టేబుళ్లు
- ఉదయం 8 గంటల నుంచే ఓట్ల లెక్కింపు
- ముందుగా పోస్టల్ బ్యాలెట్లు, ఆ తర్వాత ఈవీఎంల ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ విధుల్లో 900 మంది ఎన్నికల సిబ్బంది

రంగారెడ్డి, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ): 'రంగారెడ్డి జిల్లాలోని 8 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడేందుకు ఇంకా కొన్ని గంటల సమయం మాత్రమే ఉంది. ఓట్ల లెక్కింపునకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో 209 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. 21,11,204 మంది ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని నేడు తేల్చనున్నారు. మూడు ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఓట్ల లెక్కింపు కోసం ఒక్కో నియోజకవర్గంలో 14 చొప్పున టేబుళ్లను ఏర్పాటు చేస్తుండగా.. 400 కంటే ఎక్కువగా పోలింగ్ కేంద్రాలు ఉన్న నియోజకవర్గంలో అదనంగా టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలు కానున్నది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించి.. 8.30 గంటల నుంచి ఈవీఎంలలోని ఓట్లను లెక్కించనున్నారు. ఉదయం 10 గంటలకు తొలి ఫలితం వెలువడే అవకాశం ఉంది. 900 మంది ఎన్నికల సిబ్బంది కౌంటింగ్ విధులను నిర్వర్తిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీస్ శాఖ పటిష్ఠ బందోబస్తు చర్యలను చేపడుతున్నది.

**ప్రతి టేబుల్ వద్ద నలుగురు సిబ్బంది**

జిల్లాలోని 8 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం 290 మంది సూపర్ వైజర్లు, 331 మంది అసిస్టెంట్స్, 279 మంది మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల విధులను నిర్వర్తిస్తున్నారు. ప్రతి టేబుల్ వద్ద ఓ సూపర్ వైజర్, ఇద్దరు సహాయకులు, ఓ మైక్రో అబ్జర్వర్ ఉంటారు. అభ్యర్థుల వెంట ఓ ఏజెంటు ఉంటారు. లెక్కించిన ఓట్ల వివరాలను సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్వో), కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన పరిశీలకులు సరి చూస్తారు. కరెక్టుగా ఉన్నట్లు నిర్ధారించుకున్నాక ఆ రౌండ్ ఫలితాన్ని ప్రకటిస్తారు. జిల్లాలో మొత్తం 3,453 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. తక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న షాద్‌నగర్, కల్వకుర్తి, చేవెళ్ల నియోజకవర్గాల ఫలితాలు 18 నుంచి 23 రౌండ్లలోనే వెనువెంటనే త్వరగా వెలువడనున్నాయి. ఈసారి ఓట్ల లెక్కింపునకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి తెచ్చినందున ఫలితాలు వేగంగా వెల్లడయ్యే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.



కౌంటింగ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన కుర్చీలు



కౌంటింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా పోలీస్ ఉన్నత అధికారులు

**సీసీ కెమెరాలతో పర్యవేక్షణ**

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకుర్తి నియోజకవర్గాల కౌంటింగ్‌ను ఇబ్రహీంపట్నం పరిధిలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, ఎల్బీనగర్ ఓట్ల లెక్కింపును సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం, శేరిలింగంపల్లి ఓట్లను గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, రాజేంద్రనగర్, షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల ఓట్లను అప్పా జంక్షన్ సమీపంలోని లార్డ్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో చేపట్టనున్నారు. కౌంటింగ్ వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను విధించారు. ఆదివారం ఉదయం 6 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలను మూసి వేయాలని సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

**బీఆర్ఎస్ అభ్యర్థుల్లో గెలుపు ధీమా**

జిల్లాలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలంతా రెండు పర్యాయాలకు పైగానే గెలిచిన వారు ఉన్నారు. ఆది నుంచీ జిల్లా ప్రజానీకం గులాబీ పార్టీ వెన్నంటే ఉంది. అసెంబ్లీ ఎన్నికలే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర ఏ ఎన్నిక జరిగినా బీఆర్ఎస్‌కే పట్టం గడుతూ వచ్చారు. ఈసారి కూడా తమదే విజయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. పైకి రకరకాలుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ జిల్లాలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజానీకం సంతోషంగా ఉన్నదని, ఆ కారణంగానే అన్ని వర్గాల మెజార్టీ ఓట్లు తమకే పడుతాయన్న విశ్వాసాన్ని బీఆర్ఎస్ అభ్యర్థులు వ్యక్తం చేస్తున్నారు. గత రెండు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అద్వితీయ మెజార్టీతో విజయం సాధించిందని, ఈసారి కూడా గెలిచి కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారన్న ధీమాతో బీఆర్ఎస్ అభ్యర్థులు ఉన్నారు.

**నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన టేబుళ్ల వివరాలు**

| నియోజకవర్గం | ఈవీఎం టేబుళ్లు | పోస్టల్ బ్యాలెట్ టేబుళ్లు |
|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 14 | 06 |
| ఎల్బీనగర్ | 28 | 10 |
| మహేశ్వరం | 28 | 08 |
| రాజేంద్ర నగర్ | 28 | 08 |
| శేరిలింగంపల్లి | 28 | 07 |
| చేవెళ్ల | 14 | 06 |
| కల్వకుర్తి | 14 | 02 |
| షాద్ నగర్ | 12 | 04 |
| మొత్తం | 166 | 51 |





కౌంటింగ్ సెంటర్ వద్ద భద్రత సిబ్బంది పహారా

# ఉదయం 8 గంటల నుంచే..

- వికారాబాద్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు
- తొలుత కొడంగల్ నియోజకవర్గ ఫలితం
- చివరిగా పరిగి నియోజకవర్గ ఫలితాలు
- ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 300 మంది సిబ్బందితో మూడంచెల భద్రత
- బరిలో 61మంది అభ్యర్థులు

వికారాబాద్, డిసెంబర్ 2, (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికలపై నెలకొన్న తీవ్ర ఉత్కంఠకు నేడు తెరపడనుంది. జిల్లాలోని నాలుగు నియోజవర్గాల్లో గెలుపెవరిదనేది నేడు తేలనుంది. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి పరిగి పట్టణంలోని ఏఎంసీ గోదాంలో ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 300 మంది పోలీస్ సిబ్బందితో మూడంచెల భద్రతను ఏర్పాటు చేయడంతోపాటు ఓట్ల లెక్కింపు కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు విధిస్తూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, అంతేకాకుండా జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ర్యాలీలు, జులూస్ నిర్వహించేందుకు అనుమతి నిరాకరించారు. అయితే మధ్యాహ్నంలోగా ఏ నియోజకవర్గంలో ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తారనేది స్పష్టత రానుంది. అయితే తొలుత కొడంగల్ నియోజకవర్గ ఫలితం వెలువడనుండగా,...చివరిగా పరిగి నియోజకవర్గ ఫలితం వెలువడనుంది. జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 61 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎగ్జిట్ పోల్స్‌తోపాటు బయట ఊహాగానాలు వేరుగా ఉన్నప్పటికీ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులదే గెలుపు ఖాయమని ఆ పార్టీ అభ్యర్థులు, నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



పరిగిలోని కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

**తొలుత పోస్టల్, సర్వీస్ ఓట్ల లెక్కింపు..**

నేడు ఉదయం 8 గంటల నుంచి నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభంకానుంది. తొలుత ప్రభుత్వ ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను, సర్వీస్ ఓట్లను లెక్కించే ప్రక్రియ ప్రారంభంకానుంది. ఉదయం 8 గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుండగా, ఉదయం 8.30 గంటల నుంచి ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపును ప్రారంభించనున్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున 56 టేబుళ్లను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను బట్టి రౌండ్‌లను నిర్ణయిస్తారు. జిల్లాలోని వికారాబాద్ నియోజకవర్గంలో 284 పోలింగ్ కేంద్రాలుండగా, పరిగి నియోజకవర్గంలో 305, తాండూరులో 269, కొడంగల్ 275 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. తాండూరు నియోజకవర్గంలో తక్కువ పోలింగ్ కేంద్రాలున్నప్పటికీ పోటీ చేసిన అభ్యర్థులు ఎక్కువ మంది ఉన్న దృష్ట్యా మొదట కొడంగల్ నియోజకవర్గ ఫలితం వెలువడనుంది. అదేవిధంగా పరిగి నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు అధికంగా ఉన్నందునా,.. ఫలితాలు కూడా చివరిగా రానుంది. పరిగి నియోజకవర్గంలో ఎవరూ గెలుస్తారనేది 22 రౌండ్లు, వికారాబాద్ నియోజకవర్గానికి సంబంధించి 20 రౌండ్లకు, తాండూరు నియోజకవర్గానికి 19 రౌండ్లకు, కొడంగల్ నియోజకవర్గానికి సంబంధించి 19 రౌండ్లకు ఫలితాలు వెల్లడవనున్నాయి. ఏ నియోజకవర్గంలో ఎవరూ గెలుస్తారనేది మధ్యాహ్నం వరకు స్పష్టత రానుంది. అదే విధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం అబ్జర్వర్ల పర్యవేక్షణలో జరుగనుంది. ఓట్ల లెక్కింపులో ఒక్కో టేబుల్ వద్ద ఒక సీఎస్, ఇద్దరు సీఏలు, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారు. నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి 14 టేబుళ్లలో 104 మంది సీఎస్‌లు, 218 సీఏలు, 104 మంది మైక్రో అబ్జర్వర్లు ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగనుంది. వీరితోపాటు ఒక్కో టేబుల్ వద్ద ఆయా పార్టీలకు సంబంధించిన ఏజెంట్లు ఉండనున్నారు. వారి సమక్షంలోనే ఈవీఎంలలోని ఓట్లను లెక్కించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 9,60,376 ఓటర్లు ఉండగా,.. పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో కలిపి 7,46,123 ఓట్లు పోలయ్యాయి.

**నాలుగు నియోజకవర్గాల్లో 13 రౌండ్లలో..**

అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో భాగంగా మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రారంభించనున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి 7395 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి. అయితే ప్రతీ 500 పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు ఒక టేబుల్ చొప్పున నాలుగు నియోజకవర్గాలకు 13 టేబుళ్లను ఏర్పాటు చేశారు. పరిగి నియోజకవర్గంలో 2920 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 5 టేబుళ్లు, వికారాబాద్‌లో 1810 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకుగాను 3 టేబుళ్లు, తాండూర్‌లో పోలైన 1500 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకుగాను 3 టేబుళ్లు, కొడంగల్ నియోజకవర్గంలో పోలైన 1165 పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకుగాను 2 టేబుళ్లను ఏర్పాటు చేశారు. నాలుగు నియోజకవర్గాల్లోని పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాయంత్రం 4 గంటల వరకు పూర్తికానుంది.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

**కలెక్టర్ నారాయణరెడ్డి**

పరిగి, డిసెంబర్ 2 : కౌంటింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. శనివారం పరిగిలోని మార్కెట్‌యార్డులో ఏర్పాటుచేసిన కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి కౌంటింగ్ ఏర్పాట్లపై ఆరా తీశారు. కౌంటింగ్ కేంద్రాల్లో కౌంటింగ్ విధులు నిర్వహించే కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కౌంటింగ్ సిబ్బందిని ఉద్దేశించి కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ కౌంటింగ్ అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో సూపర్‌వైజర్ల పాత్ర చాలా కీలకమని, పారదర్శకంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలని చెప్పారు. ప్రతిఒక్కరూ ఉదయం 5 గంటల వరకే గుర్తింపుకార్డులతో సహా కౌంటింగ్ హాల్‌లో ఉండాలన్నారు. కలెక్టర్‌తోపాటు కౌంటింగ్ పరిశీలకులు స్నేహ హిందూరావుపాటిల్, సాధన, పరిశీలకులు పి.ఆకాష్, రిటర్నింగ్ అధికారులు రాహుల్‌శర్మ, లింగ్యానాయక్, శ్రీనివాసరావు, విజయకుమారి, జిల్లా పరిషత్ సీఈవో జానకిరెడ్డి, డీఎస్‌హెచ్‌వో చక్రపాణి, డీవైఎస్‌వో హనుమంతరావు, డీటీడీవో కోటాజీ, పరిశ్రమల శాఖ అధికారి వినయ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్ ఉన్నారు.



శిక్షణా శిబిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

# చలికాలం.. జర భద్రం..



**సరైన జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్య నిపుణులు**

**ఉన్ని దుస్తులు ధరించాలని సూచిస్తున్న వైద్యులు**

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 2 : చలితో పల్లెలు వణుకుతున్నాయి. చలి తీవ్రత పెరగడంతో ప్రజలు రాత్రివేళలో బయటికి వెళ్లేందుకు జంకుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రతకు వ్యాధులు విజృంభించే అవకాశాలున్నాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తూ ఆహార అలవాట్లలో మార్పులు చేసుకుంటే చలి కాలంలో కూడా ఎలాంటి ఇబ్బందులూ తలెత్తవని వారు సలహాలిస్తున్నారు. రాత్రివేళలో, తెల్లవారుజామున చల్లటి గాలులు వీస్తూ కనిష్ఠ ఉష్ణోగ్రత 15డిగ్రీలకు పడిపోతుంది. చలికాలంలో శరీర వ్యవస్థలో మార్పులతో చిన్నపిల్లలతో పాటు వృద్ధుల్లో వ్యాధులు సంక్రమించే అవకాశమున్నది. రాత్రివేళల్లో, తెల్లవారుజామున చల్లటి గాలులు వీస్తుండడంతో తీవ్రత కనిపిస్తున్నది. చలికాలంలో శరీర వ్యవస్థలో మార్పుల వల్ల పిల్లలతో పాటు వృద్ధులకు కూడా వ్యాధులు వచ్చే అవకాశమున్నది. ముందు జాగ్రత్తలు తీసుకుంటూ సరైన సలహాలు, సూచనలు పాటిస్తే, చలి రోగాల భారీనుండి ఉపశమనం దొరుకుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.



**చలిమంటల వద్ద జాగ్రత్తలు పాటించాలి**

చాలామంది అటవీ గ్రామాల్లో చలి తీవ్రతకు చలిమంటలు పెట్టుకుంటారు. దీంతో అనేక ప్రమాదాలు సంభవిస్తాయి. ఒక్కోసారి మంటలకు కళ్లు గిర్రున తిరిగి కిందపడిపోతారు. లోబీపీకి గురవుతారు. దుప్పట్లు కప్పుకుని చాలామంది మంటల వద్ద కూర్చుంటారు. అప్పుడప్పుడు మంటలు దుప్పట్లు అంటుకునే ప్రమాదాలు కూడా ఉంటాయి. చిన్నపిల్లలను మంటల వద్దకు ఎట్టి పరిస్థితిల్లో రానివ్వకూడదు.

**జాగ్రత్తలు పాటించాలి**



చలికాలంలో ప్రతిఒక్కరూ సరైన జాగ్రత్తలు పాటించాలి. ఆస్తమా వ్యాధితో బాధపడుతున్న వారు, చిన్నపిల్లలు, వృద్ధులు చాలా జాగ్రత్తగా ఉండాలి. చలికాలంలో జలుబు, దగ్గు, శ్వాసకోశ వ్యాధులు అధికంగా రావడానికి అవకాశముంటుంది. ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలి. ముఖ్యంగా చలికాలంలో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం తగ్గించాలి. చలికి ఎక్కువగా తిరగకూడదు. చలిమంటలు కాపకూడదు. ముఖ్యంగా చర్మంపై అశ్రద్ధ వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

**- సతీష్, వైద్యనిపుణులు**

**ఆస్తమా..**

చలికాలంలో ఊపిరితిత్తుల్లో శ్వాసకోశ నాళాలు కుచించుకుపోయి. గాలి సరిగా అందదు. దీంతో గాలి తీసుకోవడం, వదలడం ఇబ్బంది కలుగుతుంది. ఆయాసం, దగ్గు అధికంగా వస్తుంది. పసిపిల్లల్లో జలుబు, దగ్గును అశ్రద్ధ చేస్తే న్యూమోనియా వస్తుంది. ఈ వ్యాధివల్ల పక్కటెముకలు ఎగరేయడంతో పాటు ఊపిరితిత్తుల్లోకి నిమ్ముచేరి కొన్ని సందర్భాల్లో మరణం సంభవిస్తుంది. చిన్నపిల్లలకు ఆరునెలల వరకు తల్లిపాలు తాగిస్తే నిమ్ము చేరకుండా ఉంటుంది.

**లక్షణాలు..**

ఆస్తమా అధికశాతం వంశపారపర్యంగా సక్రమిస్తుంది. చాతి పట్టేసినట్లు ఉండడం, ఆసాయం, దగ్గుగా, శ్వాసక్రమంగా తీసుకోకపోవడం ఈ వ్యాధి లక్షణాలు, కాలుష్యం వల్ల కూడా ఆస్తమా సంక్రమిస్తుంది.

ఆస్తమా చిన్న పెద్దా తేడా లేకుండా ఎవరికైనా వస్తుంది. ఈ వ్యాధితో పెద్దగా ఇబ్బంది లేకపోయినా చలికాలం ముగిసేదాకా ఇబ్బందులు తప్పవు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

చలికాలంలో ఎండ వచ్చే వరకు చిన్నపిల్లలు, వృద్ధులు, ఆస్తమా వ్యాధిగ్రస్తులు బయటికి రావద్దు. ఉన్ని దుస్తులతో పాటు శరీరానికి వెచ్చదనం ఇచ్చే దుస్తులను వేసుకోవాలి. తలకు మఫ్లర్, మంకీ టోపీలను పెట్టుకోవాలి.

- మంచుకురిసే వేళలో బయట తిరగవద్దు..
- ఇళ్లలో సాధ్యమైనంత మేరకు ఏసీలు, ఫ్యాన్లు, కూలర్ల గాలి తగ్గించుకోవాలి.
- సాయంత్రం, రాత్రివేళలో బైక్‌లు నడపకపోవడం మంచిది.
- వాహనదారులు రాత్రివేళల్లో వాహనాన్ని ఇంట్లో పార్కింగ్ చేయాలి.
- పొగ తాగకూడదు. పొగతాగేవారి పక్కన ఉండకూడదు.
- చలిగాలుల్లో ప్రయాణించాల్సి వస్తే ఉన్ని దుస్తులు, మంకీక్యాప్ పెట్టుకోవాలి.
- దుమ్ము, ధూళి ప్రాంతాల్లో తిరగకూడదు.
- జలుబు, దగ్గు వచ్చిన వెంటనే వైద్యుల సూచన మేరకు మందులు తీసుకోవాలి.
- ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇన్‌హెలర్స్‌ను దగ్గర ఉంచుకోవాలి. ఆస్తమాను కొలిచే స్పైరో మిటర్‌తో ప్రతి ఆరునెలలకు ఒక్కసారి పరీక్ష చేయించుకోవాలి.
- తరుచూ స్నానం చేయవద్దు.

ఇబ్రహీంపట్నం సాగర్‌రహదారిపై వెలిసిన ఉన్ని దుస్తుల దుకాణం

